క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని వీనులవిందుగా జరిపారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రంలు అందించారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి విశేష పూజలు



సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామికి సోమవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు వరి విత్తనాల పంపిణీ



ఎం.రమాదేవి

పరవాడ: రైతులకు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలను స్థానిక ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా మంగళవారం ఉదయం పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల రైతాంగానికి అవసరమైన 152 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేశామన్నారు. ఆర్‌జీఎల్(2537) 69 క్వింటాళ్లు, బీపీటీ(సాంబమసూరి) 70 క్వింటాళ్లు, ఎంటీయూ(1224) 6 క్వింటాళ్లు, ఎంటీయూ(1318) 2 క్వింటాళ్లు, ఆర్ఎన్ఆర్(15048) క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఎమ్మెల్యే పంచకర్ల రైతులకు అందిస్తారని పేర్కొన్నారు.

పాలిసెట్ వెబ్ అప్షన్లపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ అభ్యర్థులకు సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ పదోతరగతి తరువాత అత్యంత కీలకమైన దశలో సాంకేతిక విద్యపై మొగ్గు చూపడం చాలెంజింగ్ నిర్ణయం అన్నారు. ఇందులో రాణిస్తే అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికపై పలు సూచనలు సలహాలు అందించారు. కళాశాల హెచ్‌వోడీలు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు.

పీజీఆర్ఎస్‌కు 9 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 9 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కిన ఆరుగురికి కోర్టు చెరో రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.60 వేలు జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. సోమవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



తాజా వర్షాలకు నారుమడి సిద్ధం చేస్తున్న రైతు

తాజాగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం పూర్తిస్థాయిలో పొలంబాట పట్టింది. తొలకరిలో వేసిన నువ్వు, గంటి ఇతర అపరాల సాగు ప్రస్తుతం పక్వానికి వచ్చింది. దీంతో వారం పది రోజుల్లో వరినారు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బోర్లు ఉన్న ప్రాంతాల్లో ఇదివరకే వరి నారు వేయడంతో దమ్ము పట్టి నాట్లుకు వీలుగా పొలాలను సిద్ధంచేసే పనిలో రైతులు తలమునకలై ఉన్నారు.

- నియోజకవర్గంలో దాదాపు 5,500 ఎకరాల్లో వరిసాగు అంచనా
- రైతు సేవా కేంద్రాల్లో 1498.1 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీకి సిద్ధం
- రెండేళ్లుగా పెట్టుబడి సాయం కోసం 22,570 మంది రైతుల ఎదురుచూపులు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెట్టుబడి సాయంగా రూ.90 కోట్ల లబ్ధి



దుక్కు చేస్తున్న రైతులు



వరి నారుకు విత్తనాలు చల్లుతున్న రైతు

పెందుర్తి:

నియోజకవర్గంలో ఖరీఫ్ సీజన్ వ్యవసాయ పనులు మొదలయ్యాయి. ఈసారి దాదాపు 5,500 ఎకరాల్లో వరి సాగు జరగనున్నట్లు యంత్రాంగం అంచనా వేస్తోంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల ద్వారా వివిధ రకాల వరి విత్తనాలు 1498.1 క్వింటాళ్లు, 57.14 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధం చేసినట్లు అధికారులు చెప్తున్నారు. పచ్చిరొట్ట వేసిన చోట్ల చేను ఏపుగా పెరగడంతో దాన్ని కలియదున్నే పనిలో రైతులున్నారు.

పెట్టుబడి సాయమేదీ?

నియోజకవర్గంలోని రైతులు ప్రభుత్వం నుంచి అందే పెట్టుబడి సాయం కోసం రెండేళ్లుగా కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పేరిట ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. గతేడాది జూన్‌లోనే కూటమి అధికారంలోకి వచ్చినా ఆ ఏడాది రైతులకు రూపాయి కూడా సాయం అందించలేదు. తాజాగా రెండో ఏడాది ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా ఇప్పటివరకు పథకం అమలుపై స్పష్టమైన ప్రకటన లేదు. దీంతో రైతులు అప్పులు చేసి సేద్యం చేసే పరిస్థితి నెలకొంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాదీ రైతుకు రూ.13,500 చొప్పున రైతు భరోసా అందించేది. ఆ క్రమంలో నాలుగు విడతల్లో నియోజకవర్గంలోని పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాల్లోని 22,570 మంది రైతులు రూ.90 కోట్లు పెట్టుబడి సాయం అందుకున్నారు. వారంతా ఇప్పుడు ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఎంతో ధైర్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయాన్ని అన్ని విధాలా ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగానే రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)లను ఏర్పాటు చేశారు. వాటి ద్వారా కస్టమ్ హైరింగ్ సెంటర్(సీహెచ్‌సీ)లు నెలకొల్పి సాగుకు ఎంతగానో దోహదపడే యంత్రాలను అందుబాటులోకి తెచ్చారు. రాయితీపై ఎరువులు, విత్తనాలకు లోటే లేకుండా చేశారు. ఎప్పటికప్పుడు రైతులకు సాగులో సందేహాలను నివృత్తి చేసేందుకు వ్యవసాయ సహాయకులను నియమించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చినా.. గతంలో అందినన్ని సేవలు అందుబాటులో లేవని రైతులు ఆక్షేపిస్తున్నారు.

అందుబాటులో ఉంటాం..



రైతులకు కావాల్సిన విత్తనాల కోసం ఇప్పటికే నమోదు ప్రక్రియ పూర్తయింది. విత్తనాలు కూడా సిద్ధమయ్యాయి. బీపీటీ(5204), బీపీటీ(3291), ఆర్‌జీఎల్(2537), ఎంటీయూ(1224), ఎంటీయూ(1121) రకాలు అందుబాటులోకి రానున్నాయి. ఖరీఫ్ సీజన్ అంతా రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటాం.

– సీహెచ్‌వీఎస్ఎస్ఎన్ చంద్రావతి, వ్యవసాయాధికారి

సబ్బవరంలో వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం రేపు



మాట్లాడుతున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

- ఆ రోజే 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమ ప్రారంభోత్సవం
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అదీప్‌రాజ్

సబ్బవరం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా, ఎన్నికల నాటి సూపర్ సిక్స్ హామీలను పూర్తిగా అమలు చేసిన పరిస్థితి లేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆక్షేపించారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు తెలిసేలా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించేందుకు సబ్బవరంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లా స్థాయిలో నిర్వహించే కార్యక్రమాన్ని అనకాపల్లిలో ఇప్పటికే ప్రారంభించినట్లు తెలిపారు. ఇరువాడలోని జీఎస్ కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి మాజీ మంత్రి, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ప్రభుత్వ విప్, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, జిల్లా పార్టీ పరిశీలకులు, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులంతా పాల్గొనాల్సిందిగా పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, బోకం రామునాయుడు, మండల కన్వీనర్ కర్రి బాబు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్‌రాజ్, మండల సర్పంచ్‌ల యూనియన్ అధ్యక్షుడు మోపాడ అప్పారావు, అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి దెడ్డం పద్మావతి, పార్టీ నాయకులు వడ్డాది అప్పలరాజు, యర్రా శ్రీనివాసరావు, ఐడి బాబు, గవర రాజు, కోట్ని అమ్మతల్లి నాయుడు, బలిరెడ్డి కనకరాజు, యడ్ల నాయుడు, పిల్లల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేదం.. భారతీయ జీవననాదం



వేద పారాయణ చేస్తున్న వేదపండితులు



పాల్గొన్న వేద పాఠశాల విద్యార్థులు

- సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ రథసారథి మాధవ్‌శర్మ

సబ్బవరం: వేదమే సనాతన భారతీయ ధర్మానికి జీవన నాదమని, విదేశీయులు సైతం భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ఆకర్షితులవుతున్నారని సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ రథసారథి మాదవ్ శర్మ తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం సప్త ఋషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేద దివస్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వేదాల జీవన సారాన్ని విదేశీయులు సైతం ఆకళింపు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు ప్రపంచ మనుగడను ఆధారంగా చేసుకుని ఉద్భవించినవిగా తెలిపారు. వేదసారమే మన సంస్కృతి, సాంప్రదాయాలను ఇన్ని కోట్ల సంవత్సరాలు సజీవంగా ఉంచగలుగుతోందన్నారు. వేద సమ్మేళనం-2025 పేరిట చతుర్వేదాలకు సంబంధించిన పండితులతో నిర్వహించిన ఈ వేద పారాయణంలో దూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరైన వేద పండితులను దుశ్శాలువా, జ్ఞాపిక, పూలమాలలతో సత్కరించారు.

ఉదయం గురుప్రార్థన, గణపతి ప్రార్థనలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఋగ్వేద, శుక్ల యజుర్వేద, అతిరుద్ర, కృష్ణ యజుర్వేద, సామవేద, అధర్వణ వేద పారాయణాలను నిర్వహించారు. ట్రస్ట్ అధినేత, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త మాధవ్‌శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

గెడ్డవాగు ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు



ఆర్డీవోకు ఫిర్యాదు ప్రతిని అందిస్తున్న దొరబాబు

పరవాడ: పరవాడలో గెడ్డవాగులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. పరవాడ రెవెన్యూ పరిధిలో సర్వే నెం.300లోని గెడ్డవాగును ఆక్రమించిన రియల్టర్‌పై చర్యలు కోరుతూ అనకాపల్లి ఆర్డీవోకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఓ రియల్టర్ తన జిరాయితీ భూములకు రోడ్డు ఏర్పాటులో భాగంగా పై సర్వే నంబర్‌లోని రూ.లక్షల విలువైన గెడ్డవాగును ఆక్రమించి దర్జాగా రోడ్డు నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించి, రోడ్డు నిర్మాణం చేపట్టినందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆక్రమణదారులతో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. ఆయన వెంట సీపీఐ నాయకులు కె.త్రినాథ్, జి.దేముడుబాబు, పోతురాజు, వరాలశెట్టి, సత్యనారాయణ, పరమేష్, దయాకర్‌లు ఉన్నారు.

కార్మిక సమ్మె విజయవంతానికి పిలుపు



సమ్మె పోస్టర్లను ప్రదర్శిస్తున్న కోటేశ్వరరావు, కార్మికులు

పరవాడ: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఫార్మాసిటీలో సోమవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కనీస వేతన చట్టం అమలుచేసి, కార్మికుల పోరాటం ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పు చేసే చర్యలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతన చట్టంతో పాటు అనేక కార్మిక చట్టాలను తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్పు చేసి, అమలుకు ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక, రైతు సంఘాలు ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కె.పోతినాయుడు, పి.చిన్నారావు, వెంకునాయుడు, చిరంజీవి, రాము, వెంకట్ పాల్గొన్నారు.

పీజీ ఈసెట్ ర్యాంకర్ సునీల్‌కు సత్కారం



సునీల్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: ఏపీ పీజీ ఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంక్ సాధించిన ఎస్ఆర్ పురం విద్యార్థి బాలిబాని సునీల్‌ను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సత్కరించారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సునీల్‌ను దుశ్శాలువతో సత్కరించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి, నాయకులు దూది వెంకటరమణ, కాయిత ఎర్రిబాబు, గొరపల్లి సోమునాయుడు, అల్లూరి గణపతి సోమరాజు, ఒమ్మి సోంబాబు, దూది శివ, గొల్లవిల్లి దివాకర్, జిన్నాల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన తప్పనిసరి

సబ్బవరం: ప్రజలందరికీ పౌర హక్కులపై అవగాహన కలిగేలా అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని మండలంలోని గుల్లేపల్లిలో సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ గ్రామంలో కుల వివక్షకు తావులేదన్నారు. తహసీల్దార్ చిన్నికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కుల వ్యవస్థ నిర్మూలనకు ఎన్నో చట్టాలు వచ్చాయని, వాటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఎస్ఐ సింహాచలం, గ్రామ పెద్దలు బోకం రామునాయుడు, బండారు శ్రీను, జైభీమ్ సేన కార్యనిర్వాహక కార్యదర్శి దుండు సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ హెచ్‌డబ్ల్యూవో మున్ని పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: దారపాలెం 11కేవీ ఫీడర్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్, మాన్సూన్ నిర్వహణ పనుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 కార్యనిర్వాహక ఇంజినీర్(ఈఈ) పి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో కుమ్మరిదిబ్బ, పాత అడవివరం జంక్షన్, దారపాలెం తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

















